ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శనివారం 26 ఏప్రిల్ 2025

జంధ్యం తొలగింపు విద్యార్థికి రెండు ఆప్షన్లు

బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సీఈటీలో జంధ్యం తొలగించాలని సిబ్బంది అడ్డుకోవడంతో మ్యాథ్స్ పరీక్షకు దూరమైన విద్యార్థికి ప్రభుత్వం రెండు ఆప్షన్‌లు ఇచ్చింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో సాధించిన మార్కులకు సరాసరిగా మ్యాథ్స్‌కు మార్కులు ఇచ్చేలా సిఫారసు చేశారు. లేని పక్షంలో మరోసారి పరీక్ష రాసే వెసలుబాటు కల్పించారు. ఉన్నత విద్యాశాఖమంత్రి సుధాకర్ విద్యార్థికి శుక్రవారం ఫోన్ చేసి రెండు ఆప్షన్‌లలో ఒకదాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. అందుకు కొంత గడువు ఇచ్చారు.

గ్రేటర్ బిల్లుకు ఆమోదం..!



- 'గ్రేటర్ బెంగళూరు' బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర
- 7 నగర పాలికెల ఏర్పాటుకు గెజిట్ ప్రకటన
- విలీనం కానున్న రామనగర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు
- మారనున్న పాలికెలు, వార్డులు
- ప్రాధికార అధ్యక్షుడిగా సీఎం

బెంగళూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): దినదినాభివృద్ధి చెందుతున్న బెంగళూరు నగరం రూపు మరింత మారనుంది. మాబృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)ని విభజించి గరిష్ఠంగా ఏడు నగర పాలికెలతో 'గ్రేటర్ బెంగళూరు' ఏర్పాటు చేసేందుకు ఆమోదం లభించింది. గ్రేటర్ బెంగళూరు పాలనా చట్టం 2024కు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ గ్రేటర్ బెంగళూరు బిల్లు గురించి మార్చి 25 కొన్ని స్పష్టతలు కోరారు. ఏప్రిల్ 24న బిల్లుకు అంగీకారం తెలిపారు. దీంతో గురువారం సాయంత్రం గ్రేటర్ బెంగళూరు పాలనాచట్టం 2024ను ప్రకటిస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీని ప్రకారం ప్రభుత్వం 'గ్రేటర్ బెంగళూరు' పరిధిని ప్రకటించింది. బెంగళూరు నగర జిల్లా మాత్రమే కాదు, బెంగళూరు గ్రామీణ, రామనగర జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు ఇందులోకి వస్తాయి. 'గ్రేటర్ బెంగళూరు' అస్థిత్వంలోకి వస్తే దీని పరిధిలోని బీబీఎంపీ, నగర పాలికె, గ్రామపంచాయతీలు రద్దు కానున్నాయి.

ఆగస్టు 15 తర్వాత ఎన్నికలు

ప్రభుత్వ అఫిడవిట్ ప్రకారం బెంగళూరు పాలికెలకు ఆగస్టు 15 తర్వాత ఎన్నికలు జరుగనున్నాయి. అప్పటికి మొత్తం ప్రక్రియ పూర్తి చేసి ఎన్నికల కమిషన్‌కు వార్డుల రిజర్వేషన్ వివరాలను సమర్పించనున్నట్లు సుప్రీంకోర్టుకు సమర్పించిన రాష్ట్రప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొంది. బీబీఎంపీ ఎన్నికలకు సంబంధించి కోర్టులో సాగుతున్న వివాదానికి నగరాభివృద్ధిశాఖ అదనపు ముఖ్యకార్యదర్శి ఎస్ఆర్ ఉమాశంకర్ ఫిబ్రవరి 22న ప్రమాణపత్రం సమర్పించారు. రాష్ట్రప్రభుత్వం బెంగళూరు పాలక బిల్లు 2024ను (జీబీఏ)ను శాసనసభ సమావేశాల్లో ప్రతిపాదించగా అందుకు సంబంధించి శాసనసభ జాయింట్ రివ్యూ కమిటీ నివేదిక సమర్పించింది. 2025 మార్చి 31లోగా గవర్నర్ ఆమోదం సాధ్యమని, బీబీఎంపీని విభజించి కొత్త పాలికెలను మే15లోగా ఏర్పాటు చేస్తామని, జూలై 15లోగా పాలికెలలో వార్డుల హద్దులను గుర్తించి పునఃవిభజన ప్రక్రియ పూర్తి చేస్తామని, ఆగస్టు 15లోగా వార్డుల రిజర్వేషన్ తుది నోటిఫికేషన్ విడుదల చేసి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సమర్పించనున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొంది.

బీబీఎంపీలో మూడంచెల పాలన



గ్రేటర్ బెంగళూరు పాలనా చట్టం 2024 ప్రకారం గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ), పాలికె, వార్డులు అనే మూడు అంచెల పాలనా వ్యవస్థ ఉంటుంది. చట్టం జారీ అయిన 120రోజుల్లోగా 'గ్రేటర్ బెంగళూరు ప్రాధికార' రూపు దిద్దుకోవాలి. జీబీఏ పరిధిలో తలా 150 వార్డులు, 7 నగర పాలికెలకు అవకాశం ఉంటుంది. ప్రతి నగర పాలికెను బెంగళూరు అనే మొదటిపదంతో నామకరణం చేయనున్నారు. నగర పాలికెలకు జనరల్ స్టాఫ్, నియామకాలకు సంబంధించి జీబీఏ అంతిమ నిర్ణయంగా ఉంటుంది. గ్రూప్ ఏ, బీ ఉద్యోగులను జీబీఏ నియమించుకోనుంది. సీ, డీ గ్రూప్ ఉద్యోగులను నగర పాలికె కమిషనర్ నియమించవచ్చు అయితే వారిపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉండదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 జడ్ఈలో నగరపాలికెలకు ఉద్దేశించిన నగరయోజనె రూపొందించే బాధ్యతలను ముఖ్యమంత్రి నేతృత్వంలో ఏర్పాటయ్యే బెంగళూరు మహానగర ప్లానింగ్ కమిటీ(బీఎంపీ)సికి కేటాయించారు.

ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోనే..

'గ్రేటర్ బెంగళూరు ప్రాధికార'కు ముఖ్యమంత్రి అధ్యక్షుడిగా ఉంటారు. బెంగళూరు అభివృద్ధి మంత్రి ఉపాధ్యక్షుడిగా కొనసాగుతారు. హోం, నగరాభివృద్ధి, రవాణా, విద్యుత్ శాఖల మంత్రులు, గ్రేటర్ బెంగళూరు పరిధిలోని మంత్రులు, చీఫ్ కమిషనర్, పాలికెల మేయర్లు, ప్రతి పాలికె నుంచి నామినేట్ అయిన ఇద్దరు సభ్యులు, బీడీఏ, జల మండలి, బీఎంటీసీ, బీఎంఆర్‌సీఎల్, బెస్కాం, నగర పోలీస్ కమిషనర్, బీఎంఎల్‌టీఏ సీఈఓ, బీఎస్‌డబ్ల్యు ఎంఎల్ ఎండీ, గ్రేటర్ బెంగళూరు నగర యోజనెకు సంబంధించి చీఫ్ అర్బన్ ప్లానర్, గ్రేటర్ బెంగళూరు ప్రధాన ఇంజనీర్, అగ్నిమాపకదళం డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. రాష్ట్రప్రభుత్వం విడుదల చేసే గ్రాంట్లను పాలికెలకు కేటాయించే బాధ్యత ప్రాధి కారకు ఉంటుంది. అంతర్గత శాఖల పనులు, పథకాల ఇన్‌చార్జ్‌లను కలిగి ఉంటుంది. ఫ్లై ఓవర్‌లు, సొరంగ మార్గాలు వంటి భారీ పథకాలను కూడా ప్రాధికారయే నిర్వహించనుంది.

బీబీఎంపీ విభజనలో కీలక అంశాలు

బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)ని విభజించేందుకు గడిచిన పదేళ్లలో ఎన్నో కీలక అంశాలు ఉన్నాయి. బీబీఎంపీ విభజనకు సంబంధించి నివేదికకై రిటైర్డు ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి బీఎస్ పాటిల్ నేతృత్వంలో నిపుణుల కమిటీని 2014 సెప్టెంబరు 22న ఏర్పాటు చేశారు. 2023 జూన్ 12న బీబీఎంపీ విభజన నివేదికకోసం నిపుణుల కమిటీని మళ్లీ రూపొందించారు. 2023 జూలై 8న మరోసారి కమిటీని బీబీఎంపీ సుధారణా సమితి (బ్రాండ్ బెంగళూరు సమితి)గా నామకరణం చేశారు. జూలై 22న మూడు అంచెల నూతన పాలనా వ్యవస్థను కల్పించే గ్రేటర్ బెంగళూరు పాలనా బిల్లు 2024ను కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపారు. జూలై 25న శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టారు. ప్రతిపక్షాల ఆగ్రహంతో ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ నేతృత్వంలో లెజిస్లేచర్ జాయింట్ రివ్యూ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో పలు సమావేశాలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు సేకరించారు. 2025 మార్చి లో శాసనసభ స్పీకర్‌కు నివేదికను కమిటీ సమర్పించింది. అనంతరం శాసనసభ సమావేశాల్లో దిగువసభలో అంగీకారం అవుతుంది. పరిషత్‌లో కొన్ని మార్పులతో అంగీకరిస్తారు. సవరణల బిల్లును మళ్లీ శాసనసభలో ప్రవేశపెడతారు. అంగీకారం అనంతరం గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు మార్చి 25న పంపుతారు. కొన్ని స్పష్టతలకోసం గవర్నర్ బిల్లును వాపసు పంపుతారు. ఏప్రిల్ 24న గ్రేటర్ బెంగళూరు బిల్లు 2024కు గవర్నర్ ఆమోదం తెల్పుతారు.

పాలికెల విభజన ఇలా..

నగర పాలికెల పరిధి, వాటిలోని వార్డులను విభజించే ప్రక్రియ, వార్డుల సంఖ్య, వాటిలోని రిజర్వేషన్‌ను రాష ప్రభుత్వ నోటిఫికేషన్‌ల ద్వారా నిర్ధారించవచ్చు. గ్రేటర్ బెంగళూరు పరిధిని రాష్ట్రప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా కాలానిగుణంగా నిర్ధారించే అవకాశం ఉంది. నగర పాలికెలలో మేయర్, ఉపమేయర్, జాయింట్ కమిషనర్, స్థాయి సమితి, జోనల్ కమిటీలు, వార్డు సమితిలు, ఏరియా కౌన్సిల్‌లు ఉంటారు. 2-7 నగర పాలికెలు, 100-125 వార్డులు, ప్రతి నగర పాలికెకు మేయర్, డిప్యూటీ మేయర్, అధికార అవధి 30 నెలలుగా నిర్ణయించారు.



చేర్నూరులో ప్రభుత్వ పాఠశాల కట్టడాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ కార్యదర్శి రష్మీ

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రష్మీ

కంప్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రష్మీ మహేష్ తెలిపారు. శుక్రవారం సండూరుతాలుకాలోని చోర్నూరు, బండ్రి, భుజంగనగర్, కృష్ణా నగర్, సుశీలనగర్, జైసింగ్ పూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల నూతన భవన పనులను సందర్శించి పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల నూతన భవనాల పనులను పరిశీలించడంతో పాటు పాఠశాల నూతన భవనాల పనులపై అక్కడి అధికారుల నుంచి సమగ్ర సమాచారం తెలుసుకుని కాసేపు చర్చించారు. ఎంపీ తుకారామ్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యను అందించేందుకు పాఠశాలలకు అన్ని మౌళిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నపూర్ణ, విద్యాశాఖ కార్యదర్శి త్రిలోకచంద్ర, కలబురిగి డివిజన్ విద్యాశాఖ కమీషనర్ ఆకాశ్ శంకర్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, సీఈవో మహమ్మద్ హారిస్ సుమేర్, తహసీల్దార్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హులిగెమ్మదేవి హుండీ లెక్కింపు

8



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

ఉగ్ర దాడులకు నిరసనగా బళ్లారిలో భారీ ర్యాలీ

6

అంతరిక్ష పరిశోధనలో మేటి కస్తూరి

- తుదిశ్వాస విడిచిన పర్యావరణ పరిరక్షకుడు
- పదులకొలదీ పురస్కారాలు.. పద్మవిభూషణుడు



ప్రధాని నరేంద్రమోదీతో కస్తూరి రంగన్ (ఫైల్)


బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచమే ఎదురుచూసేలాంటి అంతరిక్ష పరిశోధనల సాధకుడు, దేశంలో విద్యా రంగంలో మార్పులు తీసుకొచ్చిన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)కి మార్గదర్శకుడు, విస్తారంగా ఉన్న పశ్చిమ కనుమల మనుగడకోసం సుదీర్ఘ పరిశోధనలు జరిపిన పర్యావరణ నిపుణుడు కస్తూరిరంగన్ కన్నుమూశారు. దేశంలో ఎన్నో రంగాల్లో సాధకులు ఉన్నారు. ఆయన ఆలోచనలో పుట్టి చేపట్టిన ప్రతి విభాగంలోనూ తిరుగులేని మేటి అనిపించుకున్నారు కస్తూరిరంగన్. ఎగువసభ రాజ్యసభలో ఒక పర్యాయం ఎంపీగాను వ్యవహరించారు. ఇలా ఎన్నో రంగాల ఆవిష్కరణలకు కారకులైన పద్మవిభూషణుడు కస్తూరిరంగన్ (84) శుక్రవారం బెంగళూరులోని నివాసంలో తుదిశ్వాస వీడారు. ఇటీవల కొంతకాలంగా వయోసహజ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇంట్లో ఉన్న సమయంలోనే తుదిశ్వాస వీడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

1940 అక్టోబరు 24న కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో కస్తూరిరంగన్ జన్మించారు. ఎంఎస్‌సీ పీహెచ్‌డీ చేశారు. మూడు దశాబ్దాలపాటు భారతీయ అంతరిక్ష పరిశోధనా రంగంలో సేవలందించారు. 1994 నుంచి 2003 వరకు తొమ్మిదేళ్లపాటు ఇస్రో చైర్మన్‌గా కొనసాగారు. ఈ వ్యవధిలోనే చారిత్రాత్మకం అనిపించే ప్రయోగాలను సాధించారు. దేశంలో విద్యావిధానంలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు ఏర్పడిన నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. నేషనల్ కరిక్యులర్ ఫ్రేం వర్క్, నేషనల్ స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీ చాన్స్‌లర్‌గా కొనసాగారు. అహ్మదాబాద్‌లోని విక్రమ్ సారాభాయి కమ్యూనిటీ సైన్స్ సెంటర్, బోర్డు గవర్నర్స్ చైర్మన్‌గా కొనసాగారు. అధ్యాపకుడిగా బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ చైర్మన్‌గా కొనసాగారు. ప్లానింగ్ కమిషన్ సభ్యుడిగాను వ్యవహరించారు. 2012-17 వరకు జేఎన్‌యూ చాన్స్‌లర్‌గా వ్యవహరించారు. 2008-12 వరకు కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ చైర్మన్‌గా, 2015-18 వరకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ప్రెసిడెంట్‌గాను, 2015లో అటామిక్ ఎనర్జీ కమిషన్ సభ్యుడిగా పనిచేశారు. 2015-18 మధ్యన బాంబేస్టాక్ ఎక్స్ఛేంజ్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా కొనసాగారు. 2016లో బెంగళూరులోని రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కౌన్సిల్ మెంబర్‌గా వ్యవహరించారు. 2016లో ఇస్రో గౌరవ సలహాదారుడిగా కొనసాగారు. 2017-18లో నేషనల్ ఎడ్యుకేషన్ కమిటీ చైర్మన్‌గా కొనసాగారు. 2017లో అహ్మదాబాద్‌లోని విక్రమ్‌సారాబాయ్ సైన్స్ సెంటర్‌కు చైర్మన్‌గా వ్యవహరించారు. 2018లో రాజస్థాన్ సెంట్రల్ యూనివర్సిటీ చాన్స్‌లర్‌గా పనిచేశారు. 2018-21మధ్యన బెంగళూరు పబ్లిక్ అఫైర్స్ సెంటర్ చైర్మన్‌గా కొనసాగారు. 2019-24మధ్యన పూనెలోని ఐయూసీఏఏ చైర్మన్‌గా వ్యవహరించారు. 2019-25 వరకు నిమ్రానా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చైర్‌పర్సన్‌గా కొనసాగారు. 2021-23లో చెన్నైలోని సాయి యూనివర్సిటీకి గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగారు. 1982లో పద్మశ్రీ, 1992లో పద్మభూషణ్, 2000లో పద్మ విభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. 257 జర్నల్స్ పబ్లిష్ కాగా 9 పుస్తకాలను ఎడిట్ చేశారు. 120 కాన్వొకేషన్ ప్రసంగాలు చేశారు. 350కుపైగా పబ్లిక్ మెమోరియల్ ప్రసంగాలు చేశారు. ఆయనకు భార్య గతంలోనే మృతి చెందారు. ఇద్దరు కుమారులు ఉన్నారు. కస్తూరి రంగన్ మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. ఆయన సేవలను కొనియాడారు.

సరిహద్దులేని పేకాట

- రాష్ట్ర సరిహద్దులో పేకాట జోరు
- రోజుకో స్థావరంలో ఆట
- కాపలా కాసే వ్యక్తులకు సకల సౌకర్యాలు
- కిందిస్థాయి పోలీసుల సహకారం





హిందూపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో పేకాట మూడు ముక్కలు, ఆరు షోలుగా సాగుతోంది. ప్రధానంగా పరిగి, మడకశిర మండలాల సరిహద్దుతో పాటు హిందూపురం నియోజకవర్గంలోని సరిహద్దు ప్రాంతంలో పేకాట నిర్వహిస్తున్నారు. పోలీసులు పేకాటరాయుళ్లపై ఉక్కుపాదం మోపుతున్నామని చెబుతు న్నా, కొంతమంది నిర్వాహకులు బరితెగించి మొబైల్ గ్యాంబ్లింగ్ నిర్వ హిస్తున్నారు. పేకాట నిర్వాహకులకు కొంతమంది కింది స్థాయి సిబ్బంది సహకరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

జయమంగళి నది అడ్డాగా..

పరిగి మండల పరిధి, కర్ణాటక ప్రాంతంలో ఉన్న జయమంగళి నది అడ్డాగా పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం. నిర్వాహకులు పరిగి మండలంవారే కావడంతో పాటు వారికి అధికారుల అండ ఉందని ప్రచారం చేసుకుంటున్నారు. కర్ణాటకకు చెందిన మరో ఇద్దరు నిర్వాహకులు మండల సరిహద్దు ప్రాంతంలో పేకాట ఆడిస్తున్నారు. నిత్యం ఈ మండల సరిహద్దులో లక్షల్లో ఆట సాగుతున్నట్లు తెలిసింది.

సరిహద్దులో..

పురం నియోజకవర్గ సరిహద్దు ప్రాంతంలో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇక్కడ నిర్వాహకులు ఒకటి లేదా రెండు రోజులు మాత్రమే ఆటలు ఆడిస్తున్నట్లు తెలుస్తుంది. అది కూడా పోలీసులు ఇతర ప్రాంతానికి బందోబస్తుకు వెళ్లినప్పుడు ఒకరిద్దరు సీఐలు లేరని పక్కా సమాచారం ఉన్నప్పుడే ఇక్కడ పేకాట నిర్వహిస్తున్నట్లు తెలి సింది. ఇక్కడికి స్థానికు లేకాక కర్ణాటకకు చెందిన కొంతమంది పేకాట కోసం వస్తున్నట్లు సమాచారం. ఒకరోజు రెండు ఆటలు మాత్రమే సాగిస్తున్నారు. అదికూడా ఉదయం 9గంట ల్లోపు సాయంత్రం 5-6గంటలకు మాత్రమే ఆట ఆడుతున్నట్లు తెలిసింది. అదేవిధంగా హిందూపురం పట్టణ పరిధిలోని వాణిజ్య కేంద్రంగా పిలువబడే ఏరియాలో ఉన్న నదీపరివాహక ప్రాంతంలో ఆడుతున్నట్లు తెలిసింది.

కాపలా పెట్టి మరీ ఆట..

నిర్వాహకులు చుట్టూ పది మందిని కాపలాపెట్టి పేకాట నిర్వహిస్తారు. అదికూడా పేకాట స్థావరం నుంచి ప్రధాన రహదారి వరకు కాపలా ఉంటారు. సంబంధిత పోలీస్ స్టేషన్ సమీపంలో సైతం కాపలా ఉంటారు. ఒకవేళ పోలీస్ స్టేషన్ నుంచి వాహనం బయలుదేరితే మార్గమధ్యంలో ఉన్నవారికి సమాచారం ఇస్తారు. అక్కడి నుంచి పేకాట స్థావరంలో ఉన్నవారికి సమాచారం చేరవేస్తారు. దీనివల్ల పోలీసులకు పక్కా సమాచారం ఉండి స్థావరాలకు వెళ్లేలోపు పేకాటరాయుళ్లు పరారవుతున్నారు. కాపలాగా ఉండే వ్యక్తులకు ఒక్కొక్కరికి గంటకు రూ.వెయ్యిచొప్పున అందజేస్తున్నారు. అంతేకాక ప్రతినెలా మొబైల్ రీచార్జ్ కూడా పేకాట నిర్వాహకులే భరిస్తారు. దీంతోపాటు పేకాట జరిగేరోజు వారి ద్విచక్రవాహనలకు పెట్రోల్, టిఫిన్ ఖర్చులుకూడా నిర్వాహకులే భరిస్తారన్నారు. ఇన్ఫార్మర్‌గా ఉన్న వ్యక్తి నమ్మకమైన వ్యక్తి అయితే చాలు సకల సౌకర్యాలు కల్పిస్తారు.

కిందిస్థాయి సిబ్బంది సహకారం

పేకాట నిర్వాహకులకు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో పనిచేసే కొంతమంది కిందిస్థాయి సిబ్బందితో సత్సంబంధాలుంటాయి. దీంతో ఒకవేళ సీఐ, ఎస్ఐ స్థావరాలకు వెళ్లాలని సమాచారం ఇస్తే వెంటనే వారికి సమాచారం చేరవేస్తారు. ఇందుకోసం నిర్వాహకులు వారానికి ఇంత మొత్తం అని కొందరు పోలీసు సిబ్బందికి అందజేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పండగలు, మరికొన్ని ప్రత్యేక సందర్భాల్లో కింది స్థాయి సిబ్బందికి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు విమర్శలున్నాయి. పేకాట నిర్వాహకులు కిందిస్థాయి సిబ్బందిని సరిగా చూసుకోలేదంటే వెంటనే పేకాట స్థావరంపై దాడి జరిపిస్తారని సమాచారం.

కాల్పులు ఊహించలేదు..

- భయపడుతూనే కశ్మీర్ నుంచి తిరిగి వచ్చాం
- ఎస్కేయూ సభ్యుడు రాజశేఖర్

బళ్లారి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌ను చూడాలనే కోరిక, పిల్లలకు వేసవి సెలవులు రావడంతో కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడపాలని వెళ్లాము..కానీ ఇలా కాల్పులు జరిగి అమాయకులు బలి అవుతారని అనుకోలేదు. అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. బళ్లారి కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ కమిటీ సభ్యుడు టీఎం రాజశేఖర్. తన భార్య, ఇద్దరు పిల్లలు కలిసి ఆయన కశ్మీర్‌కు వెళ్లారు. ఆదివారం వీరు కుటుంబ సమేతంగా నగరానికి చేరకున్నారు. బుధవారం కాశ్మీరులో ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశ్మీర్‌కు వెళ్లాలని గత సంవత్సరమే నిర్ణయించుకున్నారు. అనుకున్నట్లే ఫ్లైట్ టికెట్స్ బుక్ చేసుకుని కశ్మీర్‌కు చేరుకున్నాము. రెండు రోజులు సరదాగా గడిపాము, మూడోరోజు బుధవారం మాపాప, మా ఆవిడ షాపింగ్‌కు వెళ్లారు. నేను బయట నిల్చుని ఆ ప్రదేశాన్ని చూస్తూ ఉన్నాను. తుపాకీల శబ్దం. తూటాలు దూసుకుంటూ మాపక్కన నుండే వారికి తగిలాయి. నేను నేలపైన పడుకుండిపోయాను. ఇలా 20 నిమిషాల తరువాత కోలుకుని లేచాను అప్పటికే అంతా అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి. అప్పుడు తెలిసింది ఉగ్రవాదులు కాల్పులు జరిపారని. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాం. 26 మంది మృత్యువాత పడడం బాధాకరం. అదృష్టవశాత్తు బయట పడ్డాం. మరో నాలుగు రోజులు ఉండి తిరిగి ప్రయాణానికి ఫ్లైట్ టికెట్ బుక్ చేశాము. ఫ్లైట్ టికెట్ ఏకంగా 5 రెట్లు పెంచేశారు, అయినా తప్పక ఫ్లైయిట్‌కు వచ్చేశాము. ఉగ్రవాదుల చర్య క్షమించరాని నేరం. అమాయక టూరిస్టులను బలికొడనం వారి పిరికి తనం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలామంది కన్నడిగులు కాశ్మీర్ టూరుకు వచ్చారు. వారు క్షేమంగా చేరుకున్నారన్నారు.



కశ్మీర్‌లో కుటుంబ సభ్యులతో రాజశేఖర్



శిక్షణ కోసం సిద్ధంగా ఉన్న లఘు విమానాలు

దూసుకెళ్తోంది..!


- దేశీయ పైలట్ శిక్షణలో భేష్.. కలబురగి విమానాశ్రయం
- అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ
- ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌లో 10వేల మంది పైలట్‌లకు డిమాండ్

6

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

షేక్స్పియర్ (జయంతి)



ఆంగ్లభాషలో పేరొందిన నాటక రచయిత, కవి, నటుడు విలియం షేక్స్పియర్ 1564 ఏప్రిల్ 26న జన్మించారు. ఆయన నాటకాలు అన్ని ప్రముఖ భాషలలోకి అనువాదమై ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. తొలుత కామెడీలు, హిస్టరీలు రాసినా ఆ తర్వాత ఎక్కువగా ట్రాజెడీలు రాశారు. 39 నాటకాలు, 154 పద్యాలు, మూడు పొడవైన పోయెమ్స్ రాశారు. ఇంగ్లండ్‌లో 'నేషనల్ పోయెట్'గా గుర్తింపు పొందారు. రోమియో అండ్ జూలియెట్, ఒథెల్లో, కింగ్ లియర్, మాక్‌బెత్ తదితర నాటకాలు నేటికీ ఆదరణ ఉన్నాయి. 1616 ఏప్రిల్ 23న కన్నుమూశారు.

శ్యామశాస్త్రి (జయంతి)



కర్ణాటక సంగీత విద్వాంసులు, వాగ్గేయకారులుగా రాణించి సంగీత త్రిమూర్తులలో మూడో వ్యక్తి శ్యామశాస్త్రి. తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా తిరువారూరులో 1763 ఏప్రిల్ 26న జన్మించారు. అసలు పేరు వేంకట సుబ్రహ్మణ్యం. బంగారు కామాక్షి దేవి ఉపాసకులు కావడంతో అమ్మవారిపై తప్ప ఇతర రచనలు చేయలేదు. తెలుగు, సంస్కృతంలలో పండితులైన ఆయన కలగడ, మాంజి, చింతామణి తదితర అపూర్వ రాగాలను కల్పించారు. మధురై మీనాక్షిదేవిని స్తుతిస్తూ తొమ్మిది కృతులు పాడగా అమినవరత్నమాలికా గా పేరొందాయి. ఆనందభైరవి రాగంలో ఎక్కువ కృతులు రాశారు. 1827 ఫిబ్రవరి 6న పరమపదించారు.

కేఎన్ కేసరి (జయంతి)



కేఎన్ కేసరిగా పేరొందిన కోట నరసింహం 1875 ఏప్రిల్ 26న ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం ఇనమనమెళ్ళూరు గ్రామంలో జన్మించారు. 11వ యేట కాలినడకన మద్రాసు చేరి అక్కడ చదువుకున్నారు. 1900లో మద్రాసులో ఒక చిన్న బాడుగ ఇంట్లో 'కేసరి కుటీరం' పేరుతో మందుల తయారీ సంస్థను ప్రారంభించారు. 1928లో స్త్రీ జనోద్ధరణకు గృహలక్ష్మి మాసపత్రికను స్థాపించారు. మైలాపూర్ తెలుగు ప్రాథమిక పాఠశాలను ఉన్నతపాఠశాల స్థాయికి చేర్చారు. 'చిన్ననాటి ముచ్చట్లు' పేరుతో ఆయన జీవిత విశేషాలను పుస్తకంగా రాశారు. దానశీలిగా పేరొందిన కేసరి 1958 జూన్ 8న కన్నుమూశారు. కాగా ఆయన మునిమనుమడు ఉన్ని కృష్ణన్ సినీ గాయకుడిగా రాణిస్తున్నారు.

విద్వాన్ వీణ వెంకట గిరియప్ప (జయంతి)



వీణ వెంకట గిరియప్ప 1887 ఏప్రిల్ 26న కర్ణాటక రాష్ట్రం మైసూరు జిల్లా హెగ్గడ దేవన కోటెలో జన్మించారు. సంగీతకారుడిగానే కాక సంగీతం ఉపాధ్యాయులుగాను రాణించారు. మైసూరు మహారాజ సంస్థానంలో 'ఆస్థాన విద్వాంసుడు' గా వ్యవహరించారు. యువరాజు కంఠీరవ నరసింహరాజ ఒడయార్ కుమార్తెకు సంగీతం పాఠాలు బోధించారు. ప్యాలెస్ బ్యాండ్‌కు డైరెక్టర్‌గా వ్యవహరించారు. మహారాజు నేతృత్వంలో పాశ్చాత్యశైలిలో క్లాజికల్ మ్యూజిక్ ఆర్కెస్ట్రా నిర్వహించిన ఘనత ఆయనది. ప్రభుత్వ ట్రైనింగ్ కళాశాల, మహారాణి హైస్కూల్‌లోనూ వీణ పాఠాలు బోధించారు. 1951లో కన్నుమూశారు. కాగా ఆయన మనుమడు విద్వాన్ శ్రీనివాస్ ప్రసన్న కూడా వీణా కళాకారుడిగా రాణిస్తున్నారు.

శ్రీనివాస రామానుజన్ (వర్ధంతి)



గణిత శాస్త్రవేత్తగా పేరొందిన శ్రీనివాస రామానుజన్ 1887 డిసెంబరు 22న తమిళనాడు రాష్ట్రం ఈరోడ్‌లో జన్మించారు. ఎటువంటి తర్ఫీదు లేకుండానే ప్యూర్ మ్యాథమ్యాటిక్స్‌లో సత్తా చాటారు. మ్యాథమ్యాటికల్ అనాలిసిస్, నెంబర్ థియరీ, ఇన్ఫినిట్ సిరీస్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్ అంశాలలో తనదైన శైలిలో జవాబులు సృష్టించారు. అనేక ఫార్ములాలకు రూపకల్పన చేశారు. గణితంలో నేటికీ ఆయన స్ఫూర్తిగా నిలిచారు. 'ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ' అవార్డు పొందారు. 32వ యేటనే 1920 ఏప్రిల్ 26న కన్నుమూశారు.

ఆర్డీటీ సెట్ రద్దు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆర్డీటీ సెట్‌ను రద్దు చేసినట్లు ఆ సంస్థ శుక్రవారం తెలిపింది. ఇంటర్‌లో కార్పొరేట్ విద్య అందించేందుకు ఆర్డీటీ సంస్థ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎఫ్‌సీఆర్ఏ సమస్య నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

దూసుకెళ్తోంది..!



కలబురగి విమానాశ్రయంలో పైలట్ శిక్షణ పొందుతున్న యువత



మినీ ఫ్లైట్‌ను సిద్ధం చేస్తున్న సిబ్బంది

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంతో పాటు దేశంలో యువత పైలట్ కావాలనే ఆకాంక్ష గలవారికి కలబురగి విమానాశ్రయం ముఖ్య వేదికగా నిలుస్తోంది. విమానాశ్రయం చుట్టు ప్రక్కల సమతట్టు ప్రాంతం, పొగమంచు లేని వాతావరణ పరిస్థితులు, సన్నని మేఘాలు, తక్కువ వర్షపాతం లాంటి సమకూల పరిస్థితులు పైలట్ శిక్షణకు తోడ్పాటు నిస్తున్నాయని చెప్పవచ్చు. ప్రస్తుతం కలబురగిలోని విమానాశ్రయం 10వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంది. రెడ్‌బర్డ్ ఫ్లైట్ ట్రైనింగ్ అకాడమీ, ఆసియా పసిపిక్ ఫ్లైట్ ట్రైనింగ్ అకాడమీ ఈ ప్రాంతంలోని వందలాది మంది విద్యార్థులకు పైలట్ శిక్షణను అందిస్తున్నాయి. ఇప్పటి వరకు హర్యానా, పంజాబ్, ఢిల్లీ, కేరళ రాష్ట్రాలతో పాటు బెంగళూరు, బీదర్, హుమనాబాద్, యాదగిరి, గుల్బర్గా, షహబాద్‌లతో పాటు సుమారు 400 మందికి పైగా కమర్షియల్(వాణిజ్య) విమాన పైలట్ శిక్షణను పూర్తి చేశారు. ప్రతి కూల వాతావరణ పరిస్థితుల్లో కూడా విమానాలు సులభంగా, సురక్షితంగా ల్యాండ్ కావడానికి సహాయపడే ఇనుస్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్స్, రన్‌వే సెంటల్ పవర్, రాడర్ ఆధారంగా అధునాత సాంకేతిక పరిజ్ఞానం లభ్యత కూడా విమాన యాన శిక్షణ సంస్థలను ఆకర్షిస్తోందని చెప్పవచ్చు. రెడ్‌బర్డ్ గత 30 సంవత్సరాలుగా ఏషియా ఫసిఫిక్ 25 సంవత్సరాల అవధికి శిక్షణ ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకుంది. గుల్బర్గా విమానాశ్రయం అంతర్జాతీయ ప్రమాణాల సాంకేతికతను స్వీకరించినందున యువ పైలట్‌లకు ఆదర్శవంతమైన శిక్షణా స్థలంగా చెప్పుకోవచ్చు. పైలట్ శిక్షణకు భారత దేశంలో ఉత్తమ వాతవరణ కూడా గుల్బర్గా విమానాశ్రయంలో కలిగి ఉండడం విశేషం. అందు చేత 7 లఘు విమానాల ద్వారా 70 విద్యార్థులకు 50కిపైగా సిబ్బంది శిక్షణ ఇస్తున్నట్లు రెడ్‌బర్డ్ వైమానిక శిక్షణా అకాడమీ సంస్థ వ్యవస్థాపకులు క్యాప్టన్ కరణ్‌మాన్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యంగా ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రాక్టికల్ శిక్షణ ఉంటుందని, నైట్ ల్యాండింగ్ సౌకర్యం ఉండడం చేత కొన్నిసార్లు 24గంటల పాటు ప్రాయోగాత్మకంగా విమానాలు ఎగురుతుంటాయి. శిక్షణ కాలం ఏడాది పాటు ఉంటుందని, శిక్షణ సమయంలో ఒక్కో విద్యార్థికి 200గంటల పాటు ప్రాక్టికల్‌గా విమానం నడిపేందుకు అవకాశం ఉంటుంది. విమానం నడిపై నైపుణ్యం, సామర్థ్యం ఉన్నా విమానాలు నడిపే శిక్షణా అవధిలో సమస్యలు ఎదురావుతాయని పైలట్ శిక్షకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి విద్యార్థికి రూ 50లక్షలు ఫీజు వసూలు చేస్తుండగా, ప్రతి రెండు నెలలకొకసారి దైహిక సామర్థ్యం, ఆన్‌లైన్ ద్వారా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు.

10వేల మంది పైలట్‌లకు డిమాండ్...

ఆత్మనిర్భార భారత అభియాన కార్యక్రమంలో భాగగా దేశీయంగా 38 విమానయాన సంస్థలు 58 ప్రాంతాల్లో విమాన శిక్షణ ఇస్తున్నాయి. దేశంలో 1500 విమానాలు కొత్తగా ఆర్డర్ చేశారని, ఒక్కో విమానానికి కనీసం 8 నుంచి 10 మంది పైలట్‌లు అవసరం అవుతారని, అందుచేత వచ్చే రోజుల్లో దేశంలో 10వేల మంది పైలట్‌లు అవసరం ఉందని గుల్బర్గా విమానాశ్రయం డైరెక్టర్ చిలకా మహేష్ అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానికంగా పైలట్ శిక్షణ ద్వారా భారత వైమానిక శిక్షణకు అవసరమైన వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటాయని, విదేశాలకు వెళ్ళి పైలట్ శిక్షణ పొందే అవసరం లేదంటున్నారు. గుల్బర్గా విమానాశ్రయం అత్యాధునిక సౌకర్యాలు ప్రయాణికులతో పాటు వైమానిక శిక్షణ సంస్థలకు సహాయపడుతున్నాయి. ఈ ప్రాంతం పైలట్ కావాలనే వారి కలలు సాకారం అవుతాయని సంస్థ నిర్వహకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

హిందువులపై దాడులను అరికట్టాలి

- పహల్గాం దాడులను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆందోళన



ర్యాలీలో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన మారణహోమాన్ని ఖండిస్తూ హిందూ దేవాలయాలు, మఠాలు,ఆస్తులను రక్షించాలని విశ్వహిందూ పరిషత్ నేతృత్వంలో హొసపేటలో నిరసన చేపట్టారు. శుక్రవారం హొసపేటలోని మదకరి నాయక సర్కిల్ తో సహ వివిధ సామాజిక సంస్థల నేతృత్వంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, హిందూ జాగరణ వేదిక, వీరశైవ సమాజ్, బ్రాహ్మణ సమాజ్ వంటి వివిధ సామాజిక సంస్థలు నగరంలోని ప్రధాన వీధుల్లో ఆందోళన ప్రదర్శన చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు భూపాల ప్రహ్లాద్, విజయలక్ష్మి హిరేమఠ్, నరసింహమూర్తి, మదురచెన్న శాస్త్రి, శంకర్‌మేటి రమేశ్ గుప్తా, కిరణ్ తదితరులు మాట్లాడారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో హిందువులపై జరుగుతున్న హత్యలు, వేధింపులు, దారుణాలను ఆపాలన్నారు. అన్యాయానికి గురైన వారికి న్యాయం అందించాలని పిలుపునిచ్చారు. పహల్గామ్‌లో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు హిందువులను లక్ష్యంగా చేసుకుని మతం పేరుతో కాల్చి చంపడం క్షమించరాని నేరమన్నారు. ఇలాంటి చర్యలను సహించబోమన్నారు. విజయనగరం జిల్లాలో ఆవుల అక్రమ రవాణా జరుగుతోంది. వారు బీఫ్ మాంసాన్ని అమ్ముతున్నారని ఈ చట్టవిరుద్ధ కార్యాకలాపాలను అరికట్టాలని నిరసనకారులు జిల్లా మేజిస్ట్రేట్‌కు విజ్ఞప్తి చేశారు.



కశ్మీర్‌లో ఉగ్రదాడులను నిరసిస్తూ బెంగళూరు కల్యాణనగర్ లే అవుట్ వాసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళి అర్పించారు. మౌనం పాటించి ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. బీజేపీ నాయకులు పద్మనాభ రెడ్డి, జగన్, రాజు నాయక్, జయంతి, పద్మజ పాల్గొన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్ప

విద్యతోపాటు క్రీడలు తప్పనిసరి: ఎమ్మెల్యే

బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యతోపాటు క్రీడలు తప్పనిసరి కావాలని బెంగళూరు దక్షిణ ఎమ్మెల్యే ఎం కృష్ణప్ప పిలుపునిచ్చారు. నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆఫ్ కర్ణాటక ఆధ్వర్యంలో 77వ వార్షిక క్రీడాపోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులలో సమాజం పట్ల అవగాహన పెరగాలన్నారు. ప్రతి విషయంలోనూ నాకెందుకనే ధోరణి వీడాలన్నారు. కేవలం చదువు మాత్రమే కాకుండా క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యం సాధ్యమన్నారు. ఎన్ఈఎస్ సంస్థ చైర్మన్ డాక్టర్ హెచ్ఎన్ సుబ్రమణ్య మాట్లాడుతూ నేషనల్ గ్రూప్ విద్యాసంస్థలు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గౌరవ కార్యదర్శి వెంకటశివారెడ్డి, కోశాధికారి తల్లం ద్వారకనాథ్, వైస్‌ప్రెసిడెంట్ మంజునాథ్, కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చూడండి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సీఐ నాగిరెడ్డి

కంప్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పట్టణాల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారి సమస్యలు పరిష్కరించి సమస్యలు తలెత్తకుండా ప్రతి ఉద్యోగి చూడాలని లోకాయుక్త సీఐ నాగిరెడ్డి సూచించారు. శుక్రవారం కంప్లి తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో లోకాయుక్త అధికారులు నిర్వహించిన ఫిర్యాదులు, సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు ఫిర్యాదులను స్వీకరించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సుగ్గేనహళ్లికి వెళ్లే రోడ్డు ఉన్న క్వారీ వల్ల దుమ్ము, రాళ్లల రువ్వడం వంటి అనేక సమస్యలు వస్తున్నాయని, సమస్యను పరిష్కరించాలని తెలిపారు. నెంబర్ టెన్ ముద్దాపురంలో మొబైల్ టవర్, వైన్ షాపులను వేరే చోటకి తరలించడంపై ఫిర్యాదు చేశారు. దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. రెవెన్యూ శాఖ నుండి రెండు దరఖాస్తులు, ల్యాండ్ సర్వే శాఖ, విద్యాశాఖ, పోలీసు శాఖ నుంచి ఒక్కో దరఖాస్తు వచ్చాయన్నారు. ఏ అధికారి అవినీతికి పాల్పడిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజు, ఈవో శ్రీకుమార్, ముఖ్య అధికారి దురుగన్న, లోకాయుక్త శాఖ సిబ్బంది అంజినప్ప, దానప్ప, హోన్నూరప్ప వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉగ్ర దాడులకు నిరసనగా భారీ ర్యాలీ

బళ్లారి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదులు కిరాతకంగా జరిపిన కాల్పులను ఖండిస్తూ శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నగరంలోని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి నేతృత్వంలో భారీ శాంతిర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి పెద్దసంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు వందలాది మంది కొవ్వొత్తుల ర్యాలీ ప్రదర్శించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే భరత్ రెడ్డి మాట్లాడుతూ ఇది కేంద్ర ప్రభుత్వ నిఘా వైఫల్యమేనన్నారు. ఉగ్రవాదులను తుదముట్టించాలని డిమాండ్ చేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించేందుకు సిద్ధంగా వున్నామన్నారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ నందీష్ బాబు, కార్పొరేటర్లు ప్రభంజన్ కుమార్, మించు శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ హెగ్డే, ముండ్రిగి నాగరాజు, వివేక్, విక్కి, సుబ్బరాయుడు, రామాంజినేయులు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాడి ఉత్పత్తులతో ఆర్థిక స్వావలంబన సాధించాలి

- జడ్పీ ఉప కార్యదర్శి శివానందపురె



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాయచూరు ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : సహకార సంఘాలుగా ఏర్పాటైన మహిళలు పాడి ఉత్పత్తిని గణనీయంగా పెంచి ఆర్థికంగా మరింత స్వావలంబన సాధించాలని జడ్పీ ఉప కార్యదర్శి శివానందపురె సూచించారు. ఇటీవల ఎన్నికల జరిగిన మహిళ పాల ఉత్పత్తుదారుల సహకార సంఘాల 45 నూతన కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, పదాదుకారులతో శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో ప్రగతి పరిశీలన సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన జడ్పీ ఉప కార్యదర్శి, పాల ఉత్పత్తులను మరింత అభివృద్ధి చేసేందుకు ఎంపీ నిధుల ద్వారా 500 సంఘాలను ఏర్పాటు చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విషయంలో మహిళలు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పాల ఉత్పత్తులను పాడి పరిశ్రమలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో మాట్లాడిన బళ్ళారా కేఎంఎఫ్ డైరెక్టర్ కేఎంఎఫ్ ద్వార పాల ఉత్పత్తులు చేసే వారికి అందించే ప్రోత్సహకాల గురించి వివరించారు.

భూమి సారం తెలుసుకుందాం..

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఏ పంట పెట్టాలన్నా తొలుత భూసారం తెలుసుకోవాలి. భూసారం మేరకు పంటలు వేసి, ఎరువులు, మందులు వాడినపుడే మేలైన దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో భూసార పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది జిల్లాకు 25,107 భూసార పరీక్షలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాన్ని విధించింది. ఈ మేరకు జిల్లా వ్యసాయాధికారి కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. మే 25వతేదీదాకా క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది మట్టి నమూనాలను సేకరించి, భూసార పరీక్షాకేంద్రానికి పంపాలి. భూసార పరీక్షాకేంద్రంలో ఎప్పటికప్పుడు భూసార పరీక్షలు నిర్వహించి, ఖరీఫ్‌లోగా సాయిల్ హెల్త్ యాప్‌లో ఫలితాలను అప్‌లోడ్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు మండలాల వారీగా ఎన్ని మట్టి నమూనాలు పంపాలన్న వివరాలను ఆయా ఏఓలకు పంపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు... రైతు సేవాకేంద్రంలో సాయిల్ హెల్త్ కార్డు యాప్‌లో మట్టి నమూనాలు సేకరించే పొలం రైతు వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత ఆర్ఎస్‌కే సిబ్బంది క్షేత్రస్థాయిలో పొలాలకు వెళ్లి, రైతుల సమక్షంలోనే మట్టి నమూనాలు తీయాలి. తర్వాత అక్కడే సదరు రైతుతో సెల్ఫీ దిగి, యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. తర్వాత సాయిల్ హెల్త్ కార్డు నంబరు వివరాలు సదరు రైతు సెల్‌ఫోన్‌కు సమాచారం వస్తుంది. ఆ నంబర్ ఆధారంగానే మట్టి పరీక్షలు చేసిన తర్వాత యాప్‌లో ఫలితాలను భూసార పరీక్షాకేంద్రం అధికారులు అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత భూసార హెల్త్ కార్డులను మండల వ్యవసాయాధికారి ద్వారా రైతులకు అందజేస్తారు.

ఉపయోగాలు..

- పొలంలో వివిధ పోషకాల స్థాయి తెలుస్తుంది.
- పొలాల్లో ఏయే పంటలు పండించుకోవచ్చో తెలుసుకోవచ్చు.
- ఎరువులను ఎంత మోతాదులో.. ఎప్పుడు వేయాలో తెలుస్తుంది.
- నేల సమస్యలైన కారు చౌడు, పాల చౌడు స్థితి తెలుస్తుంది.
- ఎరువుల వాడకంపై అనవసర ఖర్చు తగ్గించుకోవచ్చు.
- అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతుంది.

సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

పంటకోత తర్వాత మట్టి నమూనాలు సేకరించాలి. వేసవిలో, పంట లేని సమయాల్లోనే మట్టి నమూనాలు సేకరించాలి. ఎరువులు వేసిన తర్వాత నెల రోజులదాకా మట్టి నమూనాలు తీయకూడదు. నీరు పెట్టిన తర్వాత తీయకూడదు. నీడ పడే ప్రదేశాలు, నీటి ముందు ప్రాంతాలు, ఎరువు కుప్ప, గట్లు, చెట్ల దగ్గర మట్టి నమూనాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సేకరించరాదు. పొలానికి ఒక నమూనా మాత్రమే తీయాలి. పొలం ఎక్కువ విస్తీర్ణంలో ఉంటే ప్రతి 2 నుంచి 5 ఎకరాలకు ఒకటి సేకరించొచ్చు. నేల నిర్మాణం, రంగు, మురుగు పారుదల సౌకర్యం, నేలవాలు, చౌడు, క్షార, ఆమ్ల గుణాలు, పంటల సరళి తదితర విషయాల్లో తేడా కనిపిస్తే అందుకు సంబంధించిన అన్ని నమూనాలు ఆయా పొలాల నుంచి తీసుకోవాలి.

సేకరించే విధానం..!

పైరు పంటలకు 6 అంగుళాల లోతులో మట్టి నమూనా తీయాలి. పండ్ల తోటల్లో 5 నుంచి 6 అంగుళాల వరకు ప్రతి అడుగుకు నమూనా తీసుకోవాలి. చౌడు, ఆమ్ల నేలల్లో అడుగు లోతులో ప్రతి 6 అంగుళాలకు ఒక నమూనా తీయాలి. నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు తదితర వాటిని తీసివేయాలి. ఆగర్‌గానీ, పారగానీ ఉపయోగించాలి. పొలంలో వి ఆకారంతో గోతులు తీయాలి. గొయ్యి అంచుల నుంచి పారగానీ, తాపీతోగానీ మట్టిని సేకరించాలి. పొలంలో 8-10 చోట్ల ఈ పద్ధతిలో మట్టి తీసుకోవాలి. సేకరించిన మట్టినంతటినీ కలిపి నేల మీద పరిచి, 4 భాగాలు చేయాలి. మూలలకు ఎదురుగా ఉన్న భాగాల మట్టిని తీసుకుని, మిగిలిన మట్టిని పడేయాలి. ఇలా అర కిలో మట్టి నమూనాను సేకరించాలి. దానిని గుడ్డగానీ, పాలిథీన్ సంచిలోగానీ భద్రపరచాలి. రైతు పేరు, చిరునామా, సర్వే నంబర్, పొలం విస్తీర్ణం, మెట్ట, పల్లం, ఆరుతడి పంటల వివరాలు నమోదు చేయాలి. గత మూడేళ్లలో ఆయా పొలాల్లో వాడుతున్న ఎరువులు, వేయాల్సిన పంట లు, మట్టి నమూనా సేకరించిన తేదీ తదితర వివరాలను జత చేయాలి. ఇలాంటి సమాచార పత్రంతో కూడిన మట్టి నమూనాలను భూసార పరీక్షా కేంద్రంలో అందజేయాలి.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.29	1,578.44
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	442	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	327	67
నీటి నిల్వ (టీఎంసీలు)	6.87	3.76



పుస్తకాలు అందజేస్తున్న కన్నడ సంఘ సభ్యులు

కన్నడ పుస్తకాల పంపిణీ

బళ్లారిరూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నగరంలో కొట్టూరుస్వామి టీచర్స్ ఎడ్యుకేషనల్ కళాశాల కన్నడ సాంస్కృతిక మండలి నిర్వహించిన కన్నడ అభిమాని అభినయ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేపట్టారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో బాదామి, శివ లింగ నాయక మాట్లాడుతూ రచయిత సిద్ధరామ కల్మ ఏకీకరణ చరిత్ర నుంచి అనేక వాస్తవాలను వివరించారన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి చూపాలన్నారు. గొప్పవ్యక్తుల జీవితాలు పుస్తకాల రూపంలో అందుబాటులో ఉంటాయన్నారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ హిరేమట్, కొర్లగుంది. దొడ్డ కేశవరెడ్డి, కన్నడ ఉపాధ్యాయులు జయన్న, మంజునాథ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ వాహనం బోల్తా 15 మందికి గాయాలు



బోల్తాపడిన వాహనం

రాయచూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పెళ్లి బృందంతో వెళ్తున్న గూడ్స్ వాహనం బోల్తా పడి 15 మంది గాయాలపాలయ్యారు. శుక్రవారం జిల్లాలోని సింధనూరు తాలూకా కల్మంగి గ్రామ సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ప్రయాణికులకు తీవ్ర గాయాలు కాగా వారిని తాలూకా ఆస్పత్రికి తరలించారు. తావరగేరాలో పెళ్లి ముగించుకుని అరగినమర గ్రామానికి వెళుతున్న వాహనం వెనక టైర్ పేలిపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. టైర్ పేలి వాహనం అదుపు తప్పడంతో బోల్తాగొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఘటనాస్థలాన్ని సింధనూరు పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు. క్షతగాత్రులను సింధనూరు తాలూకా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

పశుగ్రాసం ట్రాక్టర్‌కు మంటలు



కాలి బూడిదైన గ్రాసం

రాయచూరు ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దు ముదగల్ తాలూకా సోమాపూర్ తండావద్ద శుక్రవారం పశుగ్రాసం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌కు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ట్రాక్టర్ పై వరి గడ్డిని తీసుకుని వెళుతుండగా వేలాడుతున్న విద్యుత్ తీగలకు గడ్డి తాకడంతో ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా మంటలు రేగడంతో వాహన డ్రైవర్ పరుగులు తీశాడు. ఇరుగుపొరుగు రైతులు వచ్చి మంటలార్పే ప్రయత్నం చేసినప్పటికి గ్రాసం కాలి బూడిదయ్యింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికొచ్చే సరికి పూర్తిగా గడ్డి కాలిపోవడంతో పాటు ట్రాక్టర్ ధ్వంసమైనట్లు గుర్తించారు.

పరిశ్రమల స్థాపన ఎప్పుడు సారూ..?

● నిరుపయోగంగానే కేఐఏడీబీ సేకరించిన 645.18 ఎకరాల భూమి ● నిరుద్యోగుల ఎదురుచూపు

బళ్లారి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు స్థాపించడం కోసం సేకరించిన భూములు నిరుపయోగంగా మారాయి. ఉపాధి కల్పనతో పాటు ఆర్థిక లావాదేవీలు కూడా జరిగి ప్రభుత్వాలకు ఆర్థిక వనరులు సమకుర్చే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో బళ్లారి జిల్లా కుడితిని వద్ద పరిశ్రమల శాఖ భూములు సేకరించింది. అయితే పరిశ్రమల ఏర్పాటు ఎండమావిగానే మిగిలిపోయాయి. కుడితిని వద్ద కర్ణాటక ఇండస్ట్రీయల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డు పరిశ్రమల స్థాపనకు రైతుల నుంచి 645.18 ఎకరాల భూమిని కొనుగోల్లు చేసింది. దీన్ని రెండు విభాగాలుగా ఏర్పాటు చేసింది. 601.18 ఎకరాల్లో ఒక బాగం, 43.91 విస్తరణంలో మరొ బాగంగా విడదీసింది. ఇక్కడ వివిధ పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా సిద్ధం చేసి ఉంచారు.

కర్నాటక-ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దులో ఉండడం వల్ల ఇక్కడికి ఎక్కువగా పరిశ్రమలు వస్తాయని అందరూ బావించారు. 2006లో పర్యావరణ శాఖ నిబంధనల నోటిపికేషన్ ప్రకారం షెడ్యూల్ 7 (సీ) కింద ఏ కేటగిరి కింద వచ్చే ప్రాజెక్టలకు అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ (ఎంఓఈఎఫ్‌సీసీ) యొక్క నిపుణుల కమిటీ అమోదం పొందాల్సి ఉంటుంది. అయితే అప్పటి అధికారులు పారిశ్రామిక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి ముందు ఎటువంటి అనుమతులు పొందలేదు. అందువల్ల ఈసీ పొందడం ఇప్పుడు సమస్యగా మారింది.

2021 జనవరి లో కేఐఏడీబి సంస్థ ఎంఓఈఎఫ్‌సీసీ నుంచి అమోదం పొందే ప్రక్రియను ప్రారంభించింది. ప్రాజెక్టును సమీక్షించిన ఈఏసీ, నిబంధనల ఉల్లఘన కారణంగా అనుమతి నిరాకరించిందని తెలిసింది. ఏదైనా ఒక పరిశ్రమ ప్రారంభించే ముందు కంపెనీ లా ప్రకారం కంపెనీ ఉద్దేశం, దాని లాభ నష్టాలు, ఉపాధికల్పన వాతావరణంపై పడే ప్రభావం, అందుకు తీసుకునే చర్యలు లాంటివి అనుమతులు పొందే ముందు కచ్చితంగా తన ఉద్దేశాన్ని ప్రాజెక్టు రిపోర్టు ఇవ్వాల్సి ఉంది. కానీ కేఐఏడిబి అధికారులు రాష్ట్ర పర్యావరణ కాలుష్య నియంత్రణ బోర్డు(కేఎస్‌పీసీబి)కి ఒక లేఖ రాశారు.



కుడితిని వద్ద నిరుపయోగంగా ఉన్న భూమి

ఎన్‌జీటి- ఎన్‌జీటి నిబంధనల ప్రకారం ఎట్టిపరిస్థితుల్లోనూ నిబంధనలు ఉల్లంఘించే ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతి ఇవ్వరాదనని పేర్కొంది. కొన్ని సంస్థలు జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయి. దర్యాప్తు కొనసాగుతున్నాయి. ఇలా కుడితిన్న వద్ద నెలకొల్పాలనుకున్న పారిశ్రామిక వాడకు అనేక అడ్డకుంటే నెలకొన్నియి. పర్యావరణశాఖ, అటవీశాఖ అనుమతులు, కర్ణాటక ఇండస్ట్రీయల్ ఏరియా డవలప్ మెంట్ బోర్డు ఏదోలా పొందినా ఇక్కడ పరిశ్ర మలు స్థాపనకు కంపెనీలు ఏమీ ముందుకు వస్తాయో.. రావో తెలియని పరిస్థితి నెకొంది. ఇక రైతులు కూడా పరిశ్ర మల నెలకొల్పేందుకు రైతులు నుంచి కొన్ని భూములు తిరిగి ఇవ్వాలనే డిమాండ్ కూడా కొనసాగుతూనే ఉంది. అప్పుడు రైతుల నుంచి తక్కువ ధరకే భూములు కొన్నారని తిరిగి రైతులకు భూములు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మొత్తం మీద కుడితిన్న వద్ద పారిశ్రామిక వాడ ఏర్పాటు ఎండమావిగానే కనిపిస్తుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జ్వరాన్ని నిర్లక్ష్యం చేయవద్దు: డీహెచ్‌ఓ



అవగాహన యాత్రను ప్రారంభిస్తున్న డీహెచ్‌ఓ రమేష్‌బాబు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కాస్త జ్వరం ఉన్నా నిర్లక్ష్యం చేయరాదని, వెంటనే రక్తపరీక్ష చేయించుకోవాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ రమేష్ బాబు సూచించారు. శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం 2025లో బాగంగా చేపట్టిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్బంగా డీహెచ్‌ఓ మాట్లాడుతూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే మలేరియాను మట్టుపెట్టవచ్చన్నారు. జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ప్రభుత్వా ఆసుపత్రిలో ఉచిత రక్తపరీక్షలు చేయించుకుని తగిన చికిత్స పొందాలన్నారు. ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాధి కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్లా మాట్లాడుతూ మలేరియా ప్లాస్మోడియం అనే పరాన్న సూక్ష్మజీవి వల్ల వస్తుందని, ఇది ఆడ అనాఫిలిస్ దోమ కాటు ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. చలి వణుకు, ఆడపాదడపా జ్వరం, వికారం, చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే దానిని మలేరియాగా పరిగణించి సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందాలన్నారు. మలేరియా కేసులు గుర్తించినప్పుడు ఆరోగ్య శాఖ ఇళ్ల చుట్టూ నిర్వహించే పురుగుమందుల పిచికారీకి ప్రజలు సహకరించాలన్నారు. నిద్రపోయేటప్పుడు దోమతెరలు వాడటం వంటి స్వీయ రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. దోమలు లోపలికి రాకుండా కిటీకీలకు తెరలు ఏర్పాటు చేయడం, ఆరోగ్య శాఖ అందించే లార్వా గుప్పీలు,గాంబూసియా చేపలను శాశ్వత నీటి వనరులలోకి వదలడానికి ఉచితంగా పొందవచ్చన్నారు. ఈసందర్భంగా జిల్లా కుష్టువ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ వీరేంద్రకుమార్,జిల్లా వీబీడీసీ కన్సల్టెంట్ ప్రతాప్, జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఈశ్వరదాసప్ప,హెల్త్ ఇన్‌స్పెక్టర్లు శకుంతల మాలీ, నాగరాజ్, రవీంద్ర, మారిబసవనగౌడ, సాంకేతిక అధికారులు అంబుజా, నందిని, శకుంతల, తాలూకా ఆరోగ్య అధికారులు, మలేరియా లింక్ వలంటీర్లు, ఇతర జాతీయ ఆరోగ్య కార్యక్రమ సిబ్బంది పాల్గొన్నారు. అవగాహన యాత్రలో నగరంలోని ప్రధాన వీదులు, వార్డుల గుండా ప్రయాణించి మలేరియా గురించి ప్రజలకు తెలియజేసింది.

అంజనాద్రి కొండలో పరిశుభ్రత కార్యక్రమం



ప్లాస్టిక్ వ్యర్థాలను తరలిస్తున్న సేవాసంస్థ సభ్యులు

గంగావతి రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గంగావతి తాలూకా చిక్కరాంపూర్ సమీపంలోని అంజనాద్రి కొండల్లో గురువారం అంజనాద్రి పర్యావరణ వ్యవసాయ విద్య, నైపుణ్య అభివృద్ధి సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్చతా కార్యక్రమం నిర్వహించారు. కొండ దిగువన ఉన్న టిఫిన్, చెరకు రసం, కొబ్బరి కాయలు అమ్ముకునే వ్యాపారులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పరిశుభ్రతా పనుల్లో పాల్గొన్నారు. పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా చాలా వరకు ప్లాస్టిక్ బాటిళ్ళు, గుట్కా, పాత చెప్పులు, ప్లాస్టిక్ కాగితాలు సుమారు 100 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అంజనాద్రి పర్యావరణ వ్యవసాయ విద్య, నైపుణ్యాభివృద్ధి సేవా సంస్థ అధ్యక్షుడు ప్రశాంత్ రాజ్నాల్ మాట్లాడుతూ అంజనాద్రిని భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శిస్తారు. కానీ ఆలయం దగ్గర, కొండపైనా ఎక్కడ చూసిన ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తున్నారన్నారు. జిల్లా యంత్రాంగం, ఆలయ కమిటీ భక్తులకు అవగాహన కల్పించి పుట్‌పాత్ దగ్గర ప్లాస్టిక్ బాటిళ్ళు, కాగితం, చెప్పులు, గుట్కా తీసుకెళ్లడాన్ని నిషేధించి, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా సేవాసంస్థ ఉపాధ్యక్షుడు బాలప్ప, కార్యదర్శి దొడ్డబసప్ప,ఆంజనేయగౌడ్,మంజునాథ్ , నాగరాజ, నింగజ్జ,నామానాయక్, హనుమవ్వ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌ఎస్ మహిళా పదాధికారుల ఎన్నిక



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న సభ్యులు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో కర్ణాటక రాష్ట్ర దళిత సంఘర్షణ సమితి కార్యాలయంలో ఆర్ గురుమూర్తి వర్గం మహిళ రాజ్య అధ్యక్షురాలు ఎం శాంత జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ నేతృత్వంలో బళ్లారి నగర పదాధికారులను శుక్రవారం ఎన్నుకున్నారు. రాజ్య అధ్యక్షురాలు శాంత, జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ నేతృత్వంలో బళ్లారి నగర మహిళా అధ్యక్షురాలిగా మీనా నగర ఉపాధ్యక్షురాలిగా , పొన్నూరు అమ్మను ప్రధాన కార్యదర్శిగా సుంకమ్మ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ మహిళలు ఇంటి నుంచి బయటకు వచ్చి సామాజిక సేవలో పాల్గొనడానికి ఉత్సాహం చూపాలాన్నారు. అనంతరం నగర అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ గౌసియా రాష్ట్ర కార్యదర్శి దాక్షాయణి, జిల్లా ప్రధానకార్యదర్శి కుసుమ జిల్లా ఉపాధ్యక్షురాలు మంజుళ జిల్లా కార్యదర్శి ఉమాదేవి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సుజాత, వసంత పాల్గొన్నారు.



హుండీ సొమ్ము లెక్కిస్తున్న వలంటీర్లు, బ్యాంక్ సిబ్బంది

హులిగెమ్మదేవి హుండీ లెక్కింపు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా మునిరాబాద్ సమీపం హులిగిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం హులిగెమ్మ దేవి ఆలయంలోని 25హుండీలను శుక్రవారం లెక్కించారు. మొత్తం రూ.94,64,855 నగదు వచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. నగదుతోపాటు 160గ్రాముల బంగారం, 10 కిలోల వెండి సేకరించారు. ఇది దాదాపు 40రోజుల్లో సేకరించబడింది. ఈ లెక్కింపులో హిట్నా గ్రామీణ బ్యాంకు సిబ్బంది, వలంటీర్లు, పోలీసులు, హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారని హులిగెమ్మ దేవి ఆలయ ప్రాంత అభివృద్ధి అథారిటీ కార్యదర్శి ఎంహెచ్ ప్రకాశ్ రావు తెలిపారు.

పహల్గాం ఘటనపై ముస్లింల నిరసన



ర్యాలీలో పాల్గొన్న ముస్లిం నాయకులు

బళ్లారి సిటీ/రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో హిందువుల కిరాతక హత్యను ఖండిస్తూ ముస్లిం మతాధికారుల నేతృత్వంలో శుక్రవారం నగరంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం నాయకుడు హుమాయూన్‌ఖాన్ మాట్లాడుతూ పహల్గాం ఊచకోత విచారకర సంఘటనగా పేర్కొన్నారు. దీనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉగ్రవాదులకు మద్దతు ఇచ్చే, ఆశ్రయం ఇచ్చే వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. అమాయక ప్రజలను చంపిన ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. హంతకులు మనుషులు కాదు, రాక్షసులని, ఇలాంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా ఉండాలంటే కఠిన శిక్షలే విధించాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మౌన ప్రదర్శన నిర్వహించి అసిస్టెంట్ కలెక్టర్ మహమ్మద్ జుబేరాకు మనవిపత్రం అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆసిఫ్ బాష, అయాజ్ అల్లాబకాష్, జహీర్, సమీర్, సిద్దిక్ బాషాతదితరులు పాల్గొన్నారు.

రాజ్‌కుమార్‌తో కన్నడకు ఖ్యాతి

● జయంతి వేడుకల్లో అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్



రాజ్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ రాజ్ కుమార్ గొప్పవ్యక్తిత్వం కలిగిన నటుడని, ఆయనతోనే కన్నడకు దేశ వ్యాప్త ప్రాముఖ్యత లభించిందని అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్ అన్నారు. కన్నడపై అపారమైన జ్ఞానం ఉన్న ఆయన ప్రజల మనస్సుల్లో చెరగని ముద్రవేశారని అన్నారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, సమాచార, ప్రజా సంబంధాల శాఖ సంయుక్తంగా డాక్టర్ రాజ్‌కుమార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాయి. డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరలో గురువారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రాజ్‌కుమార్ ఆదర్శాలు, విలువలు నేటికీ ఆచరణీయమని అన్నారు. కల్యాణ కర్ణాటక పోరాట సమితి బళ్లారి జిల్లా శాఖ అధ్యక్షుడు సిరిగేరి పన్నరాజ్ ప్రత్యేక ఉపన్యాసంలో మాట్లాడుతూ కన్నడ గుర్తింపు, కన్నడ రత్నం డాక్టర్ రాజ్‌కుమార్ జయంతిని జిల్లాస్థాయిలో జరుపుకోవాలని ఆదేశించిననందుకు రాష్ట్రప్రభుత్వాన్ని అభినందించారు. రాజ్‌కుమార్ పౌరాణిక , చారిత్రక నేపథ్యంతో పాటు, సామాజిక ఆందోళన కలిగించే సినిమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆయన సినిమాలన్నీ కుటుంబ సమేతంగా చూసేలా ఉన్నాయి. ఈసందర్భంగా జమ్మూ కాశ్మీర్‌లోని అంనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని నివాళి అర్పించారు. ఈసందర్భంగా సమాచార ప్రజా సంబందాలశాఖ గురురాజా, కన్నడ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షుడు నిష్టిరుద్రప్ప, వాణిజ్య పరిశ్రమల సంఘం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి, కర్ణాటక యువసంఘం అధ్యక్షుడు బసవరాజు, మహానగర పాలికె మాజీ మేయర్ మల్లనగౌడ, వలీసాబ్, వివిధకన్నడ సంఘాల ఆఫీస్ బేరర్లు, రాజ్‌కుమార్ అభిమానులు, ప్రజాభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నీరు అమృతం లాంటిది..

● కాపాడుకోవడం అందరి బాధ్యత: న్యాయాధికారి రాజేష్ హొసమనె



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె

బళ్లారి సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నీరు అమృతం లాంటిది దానిని సంరక్షించడం, ప్రతిఒక్కరి బాధ్యత అని సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె అన్నారు. కర్ణాటక రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు, బళ్లారి ప్రాంతీయ కార్యాలయం, జిల్లా న్యాయసేవల అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బళ్లారిలోని 'బెస్ట్' కళాశాలలో ప్రపంచ జల, భూమి దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఉన్నది ఒకే భూమి దానిని రక్షించుకోవాలన్నారు. పర్యావరణాన్ని కాలుష్యం నుంచి విముక్తి చేయాలని విద్యార్థులకు సూచించారు. కర్ణాటక రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ అధికారి సిద్దేశ్వర బాబు ప్రపంచ జలం, భూమి దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. చెట్టును బిడ్డలా చూసుకోవాలని, భూమిని తల్లిగా గౌరవించాలి, నీరు కేవలం నీరు కాదు అన్నిజీవులకు జీవజలం అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని జీవశాస్త్ర అధ్యాపకుడు విజయ్‌కుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో బెస్ట్ కళాశాల కార్యదర్శి మన్నె శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, సోమశేఖర్, లెక్చరర్లు, కన్నడ అధ్యాపకులు మల్లికార్జున మఠపతి, ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

సరిహద్దులో నిఘా పెంపు

హోసూరు రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ ఉగ్రవాద ఘటన నేపథ్యంలో తమిళనాడు సరిహద్దులో నిఘా పెంచారు. ఉత్తరాది రాష్ట్రాలనుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రధాన జాతీయ రహదారి హోసూరు మీదుగా వెళ్తుంది. జూజువాడి చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను పరిశీలిస్తున్నారు. ఉగ్రవాదుల ఊహాచిత్రాలను విడుదల చేసి, వారి ఆచూకీ తెలిపినవారికి రూ.20లక్షల నజరానా ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సరిహద్దుల్లో నిఘా పెంచారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

హోసూరు జోన్



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎంపీ గోపీనాథ్

కశ్మీర్ మృతులకు నివాళి

హోసూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన పర్యాటకులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీ గోపినాథ్ నేతృత్వంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద ర్యాలీ ముగిసింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ నీలకంఠన్, మైనారిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాదిక్‌ఖాన్ అధ్యక్షత వహించారు. స్థానిక ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

'నీట్' విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

హోసూరు (కృష్ణగిరి), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): హోసూరు బాలికల ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూల్‌లో టైటాన్ కార్పొరేట్ సంస్థ సీఎస్‌ఆర్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నీట్ పరీక్ష ఉచిత కోచింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రాక్టీస్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కలెక్టర్ దినేశ్‌కుమార్, సబ్‌కలెక్టర్ ప్రియాంక పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రసంగించారు. కోచింగ్‌ను సద్వినియోగం చేసుకుని చక్కగా రాణించాలన్నారు. శ్రమిస్తే నీట్‌లో సీట్ సాధించడం కష్టం కాదన్నారు. కోచింగ్ ఇస్తున్న ఉపాధ్యాయులను, టైటాన్ సంస్థను అభినందించారు. ప్రిన్సిపాల్ కురల్ వాసుకి, టైటాన్ కంపెనీ మేనేజర్ వైరవేల్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల చోరీతో బెంబేలు

హోసూరు (క్రైం), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): హోసూరులో ఖరీదైన ద్విచక్రవాహనాలను లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీల ద్వారా బహిరంగం కావడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలో వివిధభాషలు మాట్లాడేవారు సుమారు 5లక్షలమంది ఉన్నారు. వివిధ ఫ్యాక్టరీలు, ఆఫీసులు, షాపులు తదితర వాటిల్లో పనిచేసేందుకు ప్రజలు ఎక్కువగా ద్విచక్రవాహనాలను ఉపయోగిస్తుంటారు. ఇళ్లముంగిట పార్కింగ్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీ అవుతున్నట్లు తెలుస్తోంది. ముహేంద్రనగర్ ప్రాంతంలో నవీద్‌పాషా అనే వ్యక్తి గురువారం రాత్రి తన ఖరీదైన రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనం ఇంటి పార్కింగ్‌ప్లేస్‌లో ఉంచాడు. శుక్రవారం ఉదయం చూసేసరికి కనిపించలేదు. తర్వాత సీసీ కెమెరా పుటేజీలు పరిశీలించగా నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. హడ్కో పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇటీవల కొన్ని రోజులుగా చోరీలు అధికమైనట్టు తెలుస్తోంది. రాత్రిపూట గస్తీ లేకపోవడంతోనే చోరీలు అధికమయ్యాయనే విమర్శలు ఉన్నాయి.



సీసీ కెమెరాల్లో రికార్డయిన బైక్ చోరీ దృశ్యం